జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి:01 | సంచిక: 94 | 16-4-2026 | వెల: రూ.2/- | పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

# మాదిగలే మెజారిటీ

## రాష్ట్ర జనాభాలో ఉపకులాలే కీలకం




- రాష్ట్ర ప్రభుత్వం 2024లో నిర్వహించిన కుల, ఉద్యోగ, సామాజిక గణనలో తేలిన లెక్కలు
- వివరాలు వెల్లడించిన మంత్రులు,పీసీసీ చీఫ్, సీఎస్..
- రాష్ట్ర మొత్తం జనాభా 3.54 కోట్లు

హైదరాబాద్: తెలంగాణలో ఉపకులాల వారీగా జనాభా చిత్రం స్పష్టమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల్లో ఏ కులం జనాభా ఎంత ఉందనే గణాంకాలు బహిర్గతమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగరాజకీయ, కుల సర్వే (ఎస్ఈఈఈపీసీ2024) వివరాలను బుధవారం ప్రభుత్వం బహిర్గతం చేసింది. అందులో భాగంగానే ఉపకులాల వారీగా జనాభా గణాంకాలు వెల్లడయ్యాయి. ఈ నివేదికలో రాష్ట్రంలోని వందలాది ఉపకులాల జనాభా, వాటి శాతం, సామాజిక, ఆర్థిక స్థితి సూచికలు (సీబీఐ స్కోర్లు) వివరంగా పొందుపర్చారు. ఈ సమగ్ర సర్వేలో పలు కులాల మధ్య వ్యత్యాసాలు, అసమానతలు స్పష్టంగా బయటపడ్డాయి. ఈ సర్వే వెల్లడించిన గణాంకాల ప్రకారం కొన్ని ఉపకులాలు రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. అందులో మాదిగ కులం (ఎస్సీ) 36.57 లక్షల జనాభాతో (మొత్తం జనాభాలో 10.3 శాతం)

- మిగతా 2వ పేజీలో



## పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి అన్న చంద్రబాబు

- పల్నాడు జిల్లా ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 62 గ్రామీణ ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటు
- పేదల ఆకలి తీరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య
- గత ప్రభుత్వం అన్నదానాన్ని అడ్డుకుందని తీవ్ర విమర్శలు
- రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్ల మొత్తం సంఖ్య

పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృధా అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో ఏర్పాటు చేసిన గ్రామీణ అన్న క్యాంటీన్‌ను ఆయన కార్మికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసి, అక్కడి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు, క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు, కార్మికులకు ఆయనే స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, "పేదవాడి ఆకలి తీర్చడానికే ప్రజా ప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. ఎన్టీఆర్ రూ.2కే కిలోయ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. అదే స్ఫూర్తితో సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం" అని అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే తొలుత


- మిగతా 2వ పేజీలో



## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

- 8 మంది భక్తుల మృతి
- మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ
- ఘటనలో 8 మంది కర్ణాటక భక్తులు అక్కడికక్కడే మృతి
- మరో 12 మందికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తుండగా ఘటన

2లో




## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

- మొదటి సంవత్సరంలో 77 శాతం
- రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా



# యుద్ధం ముగిసినట్టే..!

- త్వరలోనే తెర దించుతాం: ట్రంప్
- ఆ వెంటనే గల్ఫ్‌కు 10 వేల సేనలు!
- ఇరాన్‌కు అధ్యక్షుని రెండు షరతులు
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు యథాతథం
- కొనసాగుతున్న హార్మూజ్ దిగ్బంధం
- గల్ఫ్ వర్తకాన్నే స్తంభింపజేస్తాం: ఇరాన్

2లో

వాషింగ్టన్/దుబాయ్/ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో యుద్ధం దాదాపుగా ముగిసినట్టేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో సాయుధ పోరుకు అతి త్వరలో తెర పడుతుందని బుధవారం ఫాక్స్ న్యూస్ వార్తా సంస్థకు వెల్లడించారు. కనుక చమురు ధరలు త్వరలోనే భారీగా దిగి రానున్నాయని జోస్యం చెప్పారు. మరో రెండు రోజుల్లో ప్రపంచం అద్భుతాలను చవిచూడనుందని అమెరికా, ఇరాన్ రెండో దఫా చర్చలను ఉద్దేశించి చెప్పుకొచ్చారు. కానీ ఆ వెంటనే గల్ఫ్ ప్రాంతానికి మరో 10 వేల మంది అదనపు సైనికులను పంపుతూ అమెరికా రక్షణ



## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

- వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన
- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

2లో

## దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక**



హైదరాబాద్: పార్లమెంట్‌లో 50 శాతం సీట్లు పెరుగుతాయని కేంద్రం చెబుతున్న ప్పటికీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు లో మాత్రం ఆ ప్రస్తావన ఎక్కడా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై



## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్..

- కమిటీలలో సామాన్యులకు పెద్దపీట
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టీడీపీ
- కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం
- మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ నూతన కమిటీల ఏర్పాటు

2లో



## వికసిత్ భారత్'కు తొమ్మిది ప్రతిజ్ఞలు

- ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- కర్ణాటకలో ఆదిచుంచనగిరి మహాసంస్థాన్ మఠాన్ని దర్శించుకున్న మోదీ
- శ్రీకాలభైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

## పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి అన్న చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పట్టణాల్లో, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ  బిఅన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొత్తగా 62 గ్రామీణ క్యాంటీన్లు ప్రారంభం కావడంతో, రాష్ట్రంలో మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరిందని, త్వరలో మరో 5 సిద్ధమవుతాయని వివరించారు. అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోజూ 2.10 లక్షల మంది ఆకలి తీర్చుకుంటున్నారని, దీనికోసం ప్రభుత్వం రోజుకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలను ఆయన అభినందించారు. కొత్తగా ప్రారంభించిన క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43 కోట్లు, వాటి నిర్వహణకు ఏడాదికి అదనంగా రూ.58 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "గత పాలకులు అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్టగొట్టారు. వారికి విధ్వంసం, హింస, కూల్చడం మాత్రమే తెలుసు. అందుకే ఆ పార్టీ పేరును 'గొడ్డలి పార్టీ'గా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హతను వైసీపీ కోల్పోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది భక్తుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ రాఘవేంద్రస్వామి వారి దర్శనానికి వెళుతున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురవడంతో 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన కొందరు భక్తులు బొలెరో వాహనంలో మంత్రాలయం బయలుదేరారు. వీరి వాహనం చిలకలడోన గ్రామ సమీపానికి రాగానే, ఎదురుగా వస్తున్న రెడీమిక్స్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారిని, గాయపడిన వారిని కర్ణాటక వాసులుగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్వామి దర్శనానికి వెళ్తూ భక్తులు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్..

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీలో నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు, బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40%), ఎస్సీలకు 25 (25%), ఎస్టీలకు 7 (3.8%), మైనార్టీలకు 13 (7%) చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా... పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లు వంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమిటీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు.

## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్  ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.  మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు.

# యుద్ధం ముగిసినట్టే..!



శాఖ నిర్ణయం తీసుకుంది! వాషింగ్టన్ పోస్ట్ వార్తా సంస్థ ఈ మేరకు వెల్లడించింది. దీనికి తోడు చర్చలు తిరిగి ప్రారంభం కావాలంటే ఇరాన్‌కు ట్రంప్ తాజాగా రెండు షరతులు విధించారు. హోర్మూజ్ జలసంధిని తక్షణం పూర్తిస్థాయిలో తెరవాలని, చర్చల సందర్భంగా ఎలాంటి నిర్ణయాలైనా తీసుకునేందుకు ఇరాన్ ప్రతినిధి బృందానికి ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) పూర్తి అధికారాలివ్వాలని డిమాండ్ చేశారు. దాంతో యుద్ధానికి త్వరలో తెర పడనుందన్న ట్రంప్ ప్రకటన వాస్తవ రూపు దాల్చడం అనుమానాస్పదంగా మారింది. గల్ఫ్ ప్రాంతంలో ఇప్పటికే 50 వేల మంది అమెరికా సైనికులున్న విషయం తెలిసిందే. అమెరికా నావికా దళం ఆధ్వర్యంలో హోర్మూజ్ జలసంధి, ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగుతూనే ఉంది. ఇందుకు ప్రతీకారంగా పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రం, ఎర్ర సముద్రంలో వర్తక మార్గాలన్నింటినీ దిగ్బంధిస్తామని ఇరాన్ తాజాగా హెచ్చరించింది.

### లెబనాన్‌పై భీకర దాడులు

టైర్ (లెబనాన్): లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు దిగింది. మంగళవారం ఇరు దేశాల నడుమ వాషింగ్టన్‌లో చర్చలు మొదలవడం తెలిసిందే. అయినా బుధవారం తీర నగరం టైర్‌పై క్షిపణులు, డ్రోన్లు, బాంబులతో విరుచుకుపడింది. దాంతో ఎటు చూసినా కుప్పకూలిన భవనాలే దర్శనమిచ్చాయి. వీధులన్నీ వాటి శిథిలాలతో నిండిపోయాయి. దాడుల్లో పౌరులు భారీ సంఖ్యలో మరణించినట్టు లెబనాన్ పేర్కొంది.

### బుర్జ్ అల్ అరబ్ హోటల్ మూత

ప్రపంచంలోని అత్యంత విలాసవంతమైన హోటళ్లలో ఒకటైన దుబాయ్‌లోని బుర్జ్ అల్ అరబ్ 18 నెలల పాటు మూతబడనుంది. యుద్ధం ప్రారంభంలో ఇరాన్ జరిపిన డ్రోన్ దాడుల్లో ఈ హోటల్ తీవ్రంగా దెబ్బ తిన్నది. దాంతో మరమ్మతుల నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత 26 ఏళ్లలో ఈ హోటల్ మూతబడటం ఇదే తొలిసారి. ఇది ప్రపంచంలోనే ఏకైక సెవన్ స్టార్ కావడం విశేషం!

ఇరాన్‌కు ఇకపై ఆయుధాలు ఇవ్వబోనని చైనా అంగీకరించినట్టు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన లేఖకు రాసిన ప్రత్యుత్తరంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఈ మేరకు హామీ ఇచ్చారన్నారు. అంతేగాక అమెరికా హోర్మూజ్ జలసంధిని తెరవనుండటంపై చైనా ఎంతో సంతోషం వెలిబుచ్చిందని కూడా చెప్పుకొచ్చారు! "త్వరలో నేను చైనా వెళ్తున్నా. ప్రెసిడెంట్ జిన్‌పింగ్ గాఢమైన ఆలింగనంతో నన్ను స్వాగతించనున్నారు"అని ట్రూత్ సోషల్ పోస్టులో పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి ఖండించారు. ఇరాన్‌కు చైనా ఎప్పుడూ ఆయుధాలివ్వలేదన్నారు.

### ఇరాన్‌కు పాక్ బృందం

అమెరికా, ఇరాన్ నడుమ రెండో దఫా చర్చలకు పరిస్థితిని సానుకూలం చేసే ప్రయత్నాల్లో భాగంగా సైన్యాధ్యక్షుడు అసీం మునీర్ సారథ్యంలోని పాక్ ప్రతినిధి బృందం బుధవారం టెహ్రాన్ చేరుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తదితరులతో మంతనాలు జరిపింది. రెండో దఫా చర్చలకు ఇస్లామాబాద్‌లో ఇప్పటికే ముమ్మర ఏర్పాటు జరుగుతున్నాయి.

## వికసిత్ భారత్'కు తొమ్మిది ప్రతిజ్ఞలు

మాండ్య: 'అభివృద్ధి చెందిన కర్ణాటక, అభివృద్ధి చెందిన భారత్'అనే స్వప్నం సాకారం కావడానికి ప్రజలు తొమ్మిది సామూహిక ప్రతిజ్ఞలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. జల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం, శారీరక దృఢత్వం, సామాజిక సేవ వంటి అంశాల్లో ప్రతిజ్ఞలను ఆయన సూచించారు. తొమ్మిది ప్రతిజ్ఞల విషయంలో మనం నిజాయతీ, దృఢ నిశ్చయంతో ముందుకు సాగితే వికసిత్ కర్ణాటక, వికసిత్ భారత్ దిశగా శరవేగంగా పురోగమించగలమని స్పష్టంచేశారు.  బుధవారం కర్ణాటక రాష్ట్రం మాండ్యలో ఆదిచుంచనగిరి మహాసంస్థాన్ మఠాన్ని ప్రధానమంత్రి దర్శించుకున్నారు. శ్రీగురు భైరవైక్య మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మాజీ ప్రధానమంత్రి, జేడీ(ఎస్) అధినేత హెచ్.డి.దేవెగౌడతో కలిసి 'సౌందర్య లహరి, శివ మహిమ స్తోత్రం'పుస్తకాన్ని విడుదల చేశారు. జ్వాలా పీఠాన్ని సైతం దర్శించుకున్నారు. శ్రీకాలభైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు.

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం:



పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోం

202223 నుంచే బీఆర్ఎస్ గళమెత్తుతోందని, జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రా లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పున రుద్ఘాటించారు. పార్లమెంటులో ప్రవేశ పెట్టి న ఈ బిల్లులో ఉన్న అస్పష్టతపై ఆందోళన వ్యక్తం చేశారు.  బుధవారం నగరంలోని పీర్జాదిగూడలో కేటీఆర్ మీడియాతో మాట్లా డుతూ.. 1971లో పార్లమెంటు సీట్లపై విధించిన స్తంభన జనాభా నియంత్రణ ప్రాతిపది కన జరిగిందని గుర్తు చేశారు. ఐదు దశాబ్దా లుగా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేశాయని తెలిపారు. జాతీయ జనాభా విధానాన్ని తూ.చ. తప్పకుండా పాటించినందుకు ఇప్పుడు మమ్మల్ని శిక్షిస్తారా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం లోక్‌సభ లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం సుమారు 24 శాతం ఉందని, దాన్ని ఏ స్థితిలోనైనా కాపాడాలని చెప్పారు.  '0.01 శాతం తగ్గుదల కూడా మాకు ఆమోదయోగ్యం కాదు. ఆరు దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 24శాతం కొనసాగాలి. దీనిని మార్చే ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదు. మీరు నిప్పుల కుంపటి మీద కూర్చున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంతో ఆడుకుంటే తీవ్రమైన తిరుగుబాటు వస్తుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను అడ్డుకునేందుకు ఇతర రాజకీయ పార్టీలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని, తమ ప్రభుత్వ హయాంలో మహిళా సాధికారత కోసం అనేక చర్యలు అమలు చేసిన రికార్డు తమకు ఉందని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణలతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.  అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలి, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయి, అక్కడ వర్తింపజేయండి.



# మాదిగలే మెజారిటీ

అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత షేక్ ముస్లిం (బీసీఈ) వర్గం 27.95 లక్షల (7.9 శాతం) జనాభా కలిగి ఉంది. ఆ తర్వాత వరుసగా ముదిరాజ్ 26.39 లక్షలు (7.4శాతం), లంబాడీ (బంజారా) 24.04 లక్షలు (6.8 శాతం), యాదవ (గొల్ల) 20.18 లక్షలు (5.7శాతం)తో అతిపెద్ద కులాలుగా నిలిచాయి. రాష్ట్రంలోని మరికొన్ని కులాలు కూడా పెద్ద సంఖ్యలో జనాభాను కలిగి ఉన్నాయని ఈ నివేదిక వెల్లడిస్తోంది. గౌడ సామాజిక వర్గం 16.30 లక్షల జనాభాతో (4.6శాతం), రెడ్డి వర్గం 17.10 లక్షల జనాభాతో (4.8 శాతం), మున్నూరు కాపు 13.75 లక్షల జనాభాతో (3.9 శాతం), పద్మశాలి 11.82 లక్షల జనాభాతో (3.3 శాతం) ఉన్నాయని, ఈ వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా ప్రభావం చూపే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని సర్వే నివేదిక స్పష్టం చేస్తోంది. ఇక అనేక ఉపకులాలు చాలా తక్కువ జనాభాతో ఉన్నాయి. కొన్ని వర్గాలు 0.001% నుంచి 0.01% వరకు మాత్రమే జనాభా వాటాను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు ముండాల, పమిడి, సాంబన్ వంటి కులాల జనాభా వందల నుంచి వేల సంఖ్యలో మాత్రమే ఉందని నివేదిక చెబుతోంది. ఇవి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడే ప్రమాదంలో ఉన్నాయని సర్వే ఆధారంగా వెల్లడైన జనాభా గణాంకాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు వెల్లడిస్తున్నాయి.  సర్వేను నిశితంగా పరిశీలిస్తే.. బీసీఏ నుంచి బీసీఈ వరకు విభజించిన వెనుకబడిన వర్గాల్లో విపరీతమైన అసమానతలు కనిపిస్తున్నాయి. ఈ నివేదిక రాష్ట్రంలో కులాల మధ్య ఉన్న జనాభా అసమానతలతోపాటు సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలను స్పష్టంగా బయటపెట్టింది. పెద్ద కులాలు రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉండగా, చిన్న ఉపకులాలు అభివృద్ధి ప్రయోజనాలు అందుకోలేక వెనుకబడుతున్న పరిస్థితి స్పష్టమవుతోంది. సీబీఐ (కాంపోజిట్ బ్యాక్‌వర్డ్ ఇండెక్స్) స్కోర్లలో కూడా భారీ తేడాలు కనిపించాయి.  కొన్ని వర్గాలు 100 పైగా స్కోర్లు సాధిస్తే, మరికొన్ని 4050 మధ్యలోనే ఉండటం గమనార్హం. ఈ వ్యత్యాసం విద్య, ఉపాధి, ఆదాయ స్థాయిల్లో అసమానతలను సూచిస్తోంది. ఈ నేపథ్యంలో నిపుణుల అభిప్రాయం ప్రకారం చిన్న ఉపకులాలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు, వనరుల సమాన పంపిణీ, విద్య, ఉపాధి రంగాల్లో పలు సామాజిక వర్గాల వృద్ధి లక్ష్యంగా చర్యలు అవసరమని ఆ నివేదిక చెబుతోంది. అప్పుడే సమానాభివృద్ధి సాధ్యమవుతుందని అర్థమవుతోంది. రాష్ట్ర మొత్తం జనాభా 3.54 కోట్లు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ఇందులో బీసీ జనాభా 1.64 కోట్లు. వీరితో పాటు ముస్లిం మైనార్టీల్లోని బీసీలు 35.76 లక్షలు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా 46.25శాతం. ముస్లిం మైనార్టీల్లోని బీసీలను కలుపుకుంటే బీసీ జనాభా 56.33 శాతం. ఎస్సీ జనాభా 17.43శాతం, ఎస్టీ జనాభా 10.45 శాతం. రాష్ట్ర జనాభాలో ఓసీ జనాభా 15.79 శాతం ఉండగా... ఇందులో ముస్లిం మైనార్టీల్లోని ఓసీలు 2.48 శాతం. ఇతర ఓసీలు 13.31శాతం. తెలంగాణలో ఆసాములు ఎవరో తేలిపోయింది. ఏ సామాజిక వర్గం చేతిలో ఎంత భూమి ఉన్నదన్న గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడించింది. ఈ గణాంకాల ప్రకారం చూస్తే మొత్తం ఆరు కులాల చేతిలోనే రాష్ట్రంలోని 50 శాతం భూమి ఉన్నట్టు అర్థమవుతోంది. ఇందులో రాష్ట్ర జనాభాలో 4.8 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి అత్యధికంగా 13.5 శాతం భూమి ఉంది. ఆ తర్వాత యాదవ,లంబాడా, ముదిరాజ్, మాదిగ, మున్నూరు కాపు సామాజిక వర్గాల చేతుల్లో ఎక్కువ భూమి ఉంది.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..




# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత
- కాల్వపల్లిలో గోడపత్రికల ఆవిష్కరణ

**తొలివెలుగు, రాజాపేట:** దళిత హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వరంగల్ వేదికగా జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత పిలుపునిచ్చారు. బుధవారం రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ... ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు వరంగల్ నగరంలో ఈ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపారు. దళితుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై ఈ సభల్లో కీలక చర్చలు జరగనున్నాయన్నారు. రాజాపేట మండలం సహా జిల్లా నలుమూలల నుంచి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఇంజ శ్రీనివాస్, సాయి, మహేష్, కిష్టమ్మ, శ్రీకాంత్, ఎల్లం, కుమార్, చరణ్, హరి, భూపాల్, లాస్య, మౌనిక, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తొందర వద్దు.. జాగ్రత్త ముద్దు!

- ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన
- రోడ్డు భద్రతపై ఎస్ఐ లింగారెడ్డి దిశానిర్దేశం



**తొలివెలుగు, రాజాపేట:** విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా పాఠశాల బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మాంటెస్సోరి పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. స్కూల్ బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తోపులాటలు మానుకోవాలని, వరుస క్రమాన్ని పాటించాలని విద్యార్థులకు వివరించారు. బస్సు పూర్తిగా ఆగిన తర్వాతే ఎక్కాలని, దిగేటప్పుడు హ్యాండ్‌రైల్స్‌ను తప్పనిసరిగా పట్టుకోవాలని సూచించారు. కదులుతున్న బస్సు నుంచి దిగడానికి ప్రయత్నించడం ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రకాష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకు అరుదైన గుర్తింపు

- కరాటే బాలుకు 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' అవార్డు ప్రదానం
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

**తొలివెలుగు, రాజాపేట:** సమాజం పట్ల బాధ్యతతో నిస్వార్థంగా సేవలందిస్తున్న వారికి గుర్తింపు ఎప్పటికైనా లభిస్తుందని రాజాపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన కరాటే బాలు నిరూపించారు. సామాజిక సేవలో ఆయన చేస్తున్న విశేష కృషికి గాను అత్యున్నత 'లైఫ్ టైం అచీవ్‌మెంట్' (జీవిత సాఫల్య) పురస్కారం దక్కింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మియాపూర్‌లో విక్టరీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ విజయ్ కుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను సత్కరించారు. ఇందులో భాగంగా గ్రామీణ స్థాయిలో కరాటే బాలు చేస్తున్న నిరంతర సామాజిక సేవలను ఫౌండేషన్ గుర్తించింది. డాక్టర్ విజయ్ కుమారి చేతుల మీదుగా బాలు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కరాటే బాలు మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ పురస్కారం సామాజిక సేవ పట్ల తన బాధ్యతను మరింతగా పెంచిందని హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు, ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంలో తాను ఎప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. తాను ఈ స్థాయిలో సేవలు అందించడానికి తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటు, మిత్రుల సహకారం ఎంతో ఉందని, వారందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.




# రైతన్నల గుండెకోత.. చెక్ డ్యామ్ కూల్చివేత





- హై లెవల్ బ్రిడ్జి కాంట్రాక్టర్ నిర్వాకం
- కాల్వపల్లి-పొట్టిమర్రి వాగులో వృథాగా పోతున్న జలాలు
- అడుగంటనున్న భూగర్భ జలాలు.. ఆందోళనలో అన్నదాతలు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని రైతుల విజ్ఞప్తి

**తొలివెలుగు, రాజాపేట:** ఏళ్ల తరబడి ఆయకట్టుకు అండగా ఉంటూ, వందలాది బోరుబావుల్లో భూగర్భ జలాలను పెంపొందించిన ఓ చెక్ డ్యామ్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి బలయింది. రాజాపేట మండలంలోని కాల్వపల్లి-పొట్టిమర్రి వాగులో నూతనంగా నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనుల కోసం.. ఏళ్ల నాటి చెక్ డ్యామ్‌ను కాంట్రాక్టర్ నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. దీంతో ఇన్నాళ్లు నీటిని నిలుపుకున్న వాగు, ఇప్పుడు చుక్క నీరు లేకుండా వెలవెలబోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు నాయుడు ఉన్న హయాంలో.. సుమారు ఒక తాడిచెట్టు లోతున ఈ చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టారు. నాడు ఎంతో నాణ్యతగా, అడుగున పేపర్ వేసి, ఇనుప జాలీలు అమర్చి.. రాగడ మట్టి, నల్ల మట్టితో పటిష్టమైన గోడను నిర్మించారు. వానాకాలంలో వాగు పారితే సుమారు రెండు కిలోమీటర్ల మేర నీరు నిలిచి, ఒక మినీ చెరువును తలపించేది. ఇది కాల్వపల్లి, పరిసర ప్రాంతాల రైతులకు ఒక జీవనదిలా ఉపయోగపడేది. దీని ద్వారానే చుట్టుపక్కల వ్యవసాయ బోరు బావుల్లో ఎన్నడూ నీరు అడుగంటలేదు. తాజాగా హై లెవెల్ బ్రిడ్జి కడుతున్న కాంట్రాక్టర్, పనుల కోసం అడ్డుగా ఉందన్న సాకుతో ఆ పటిష్టమైన చెక్ డ్యామ్ గోడను తెంపేశారు. ఫలితంగా వాగులో వచ్చిన నీరు వచ్చినట్లు కిందికి వెళ్లిపోతోందని, చుక్క నీరు కూడా నిలవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూల్చేసిన చెక్ డ్యామ్‌ను కాంట్రాక్టర్ తిరిగి కట్టిస్తారా? లేక అలాగే వదిలేసి రైతుల పొట్టగొడతారా? అని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, చెక్ డ్యామ్ పునర్నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని కాల్వపల్లి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# భక్తుల భద్రతే పరమావధి






- యాదాద్రిలో ఎస్పీఎఫ్ సిబ్బందికి విపత్తు నిర్వహణ, సీపీఆర్‌పై శిక్షణ
- డీజీ స్వాతి లాక్రా ఆదేశాలతో ప్రత్యేక కార్యక్రమం

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) అధికారులు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కొండపైన విధుల్లో ఉండే టీజీ ఎస్పీఎఫ్ సిబ్బందికి అత్యవసర సమయాల్లో ప్రాణరక్షణ చర్యలు, అగ్నిమాపక నివారణపై బుధవారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ (డీజీ) స్వాతి లాక్రా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తెలిపారు. నిత్యం వేలాది మంది భక్తులతో రద్దీగా ఉండే ఆలయ ప్రాంగణంలో అనుకోని విధంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలి? మంటలను అదుపులోకి తెచ్చే ఫైర్ ఫైటింగ్ పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలి? అనే అంశాలపై అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాక్టికల్‌గా వివరించారు. అలాగే, గుండెపోటు తదితర అత్యవసర ఆరోగ్య సమస్యలతో ఎవరైనా భక్తులు కుప్పకూలిపోతే, వైద్యులు వచ్చేలోపు తక్షణమే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) చేసి ప్రాణాలు ఎలా నిలపాలి, ప్రాథమిక చికిత్స ఎలా అందించాలనే దానిపై వైద్య బృందం సభ్యులు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏ ఆపదొచ్చినా తక్షణమే స్పందించేలా సిబ్బందిని సన్నద్ధం చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ నవీన్, ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు, వైద్యులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.




# గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- యాదాద్రి జిల్లాలో ఖాళీల వివరాలు వెల్లడించిన జోనల్ అధికారి విద్యా రాణి

**తొలివెలుగు రాజాపేట:** నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే గురుకులాలు గొప్పవరమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ అధికారి ఎస్. విద్యా రాణి పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్ - ఆర్.జె.సి.సి.ఈ.టి ప్రవేశ పరీక్షకు సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఖాళీలను జిల్లా సమన్వయ అధికారి పోతంశెట్టి సుధాకర్‌తో కలిసి సోమవారం ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మే 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు.

**కళాశాలల వారీగా ఖాళీలు ఇవే:**

రాజపేట (బాలురు): ఎంపీసీ-40, బైపీసీ-40
వలిగొండ (బాలికలు): ఎంపీసీ-40, బైపీసీ-40
భువనగిరి సి సి (బాలురు): ఎంపీసీ-40, బైపీసీ-40
మోత్కూర్ (బాలురు): ఎంపీసీ-40, బైపీసీ-40
చౌటుప్పల్ (బాలికలు): ఎంపీసీ-40, బైపీసీ-40
ఆలేరు (బాలికలు): సీఈసీ-40, ఎంఈసీ-40

అడ్డగూడూరు (బాలికలు): ఎంపీసీ-40, బైపీసీ-40 ఆసక్తి గల వారు http://tgswreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఫలితాలు, కౌన్సెలింగ్ వివరాలు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు.




# శంకుస్థాపనలకే పరిమితమా?

- రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి
- లేకుంటే తహసీల్దార్ కార్యాలయ ముట్టడి: సీపీఎం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్డు మరమ్మతుల పేరిట స్థానిక ఎమ్మెల్యే ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి, పనులను మాత్రం గాలికి వదిలేశారని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కోట రామచంద్రారెడ్డి, దుబ్బాక జగన్ విమర్శించారు. మండల, పట్టణ వ్యాప్తంగా రోడ్డు పనుల కోసం వేసిన శిలాఫలకాలను బుధవారం సీపీఎం నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంతలమయంగా మారిన రోడ్లకు మోక్షం కల్పిస్తామని చెప్పి కేవలం శిలాఫలకాలకే పరిమితం కావడం శోచనీయమన్నారు. గతంలో పెద్ద రావులపల్లి నుంచి కోసుకుండా వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశామని గుర్తుచేశారు. ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి 15 నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. తక్షణమే నిలిచిపోయిన రోడ్డు పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర చేపట్టి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల, పట్టణ కమిటీ సభ్యులు బుగ్గల లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, నాయకులు చుక్క రజినీకాంత్, అశోక్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



# మీనాక్షి నటరాజన్‌కు భూదాన్ వజ్రోత్సవాల ఆహ్వానం

- 18న పోచంపల్లిలో వేడుకలు
- హైదరాబాద్‌లో కలిసి పత్రిక అందజేసిన ప్రతినిధులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** చారిత్రక ప్రాధాన్యం ఉన్న భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించనున్న భూదాన్ జయంతి వజ్రోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను పలువురు నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన సంఘమిత్ర సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. భూదాన్ ఉద్యమానికి గుర్తుగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆమెను కలిసిన వారిలో సంఘమిత్ర సంఘం ప్రతినిధులు తడక యాదగిరి, పట్నం కృష్ణకుమార్, పోచంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భారత లవకుమార్ తదితరులు ఉన్నారు.

# బాలికలు ఆత్మరక్షణ విద్యల్లో రాణించాలి

- కేజీబీవీ విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం
- గ్రాండ్ మాస్టర్ బాలరాజు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** బాలికలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకు కరాటే సాధన ఎంతగానో దోహదపడుతుందని ఇండియన్ చీఫ్ గ్రాండ్ మాస్టర్ బాలరాజు తెలిపారు. మండలంలోని జలాల్‌పురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బుధవారం స్టాండర్డ్ సిటీ ఇంటర్నేషనల్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు కరాటేలో వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులను ప్రదానం చేశారు. ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్ఓ) ఇందిర, మాస్టర్లు గంగాదేవి, జంగయ్య, చింతకింది రాజ్‌కుమార్, కుతాటి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- ఎంపీడీవో జలంధర్ రెడ్డి



**తొలివెలుగు, వలిగొండ:** విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐఐటీ విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జలంధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం ఐఐటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు ఐఐటీ శిక్షణ అనేది కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమై, భారీ వ్యయంతో కూడుకున్నదిగా ఉండేదని గుర్తుచేశారు. అటువంటి నాణ్యమైన విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన గాయత్రి పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే ఐఐటీ పునాది ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తవటం నరహరి, వైస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# భార్యపై కోపంతో కూతురి హత్య

- రెండేళ్ల చిన్నారిని పొట్టనబెట్టుకున్న తండ్రి
- హనుమాపురంలో దారుణం.. నిందితుడు లొంగుబాటు



**తొలివెలుగు, భువనగిరి:** భార్యపై ఉన్న కక్షతో ఓ తండ్రి కన్నకూతురినే అంతమొందించిన దారుణ ఘటన భువనగిరి మండలం హనుమాపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాములు, నాగరాణి దంపతులకు రెండేళ్ల కుమార్తె ఉంది. శ్రీరాములు మూగ, చెవుడు కావడంతో పాటు గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మనస్పర్థల కారణంగా నాగరాణి కొంతకాలం పుట్టింటి వద్దే ఉండగా, ఉగాది పండుగ సమయంలో తిరిగి భర్త వద్దకు వచ్చింది. బుధవారం భార్యపై ఉన్న కోపంతో శ్రీరాములు తన రెండేళ్ల కుమార్తెను ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. పాప ప్రాణం పోయిన తర్వాత ఆ మృతదేహాన్ని భార్యకు వీడియో కాల్ చేసి చూపించడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. అనంతరం నిందితుడు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# వలిగొండలో రేషన్ బియ్యం పట్టివేత!





- 22 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం
- పొలాల్లో నిల్వ ఉంచి తరలిస్తుండగా దాడి

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలో రేషన్ బియ్యం దందా మరోసారి కలకలం రేపింది. టేకుల సోమారం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. చౌటుప్పల్ డివిజన్ సివిల్ సప్లై అధికారిణి బాలమణికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పడమటివారి గూడెం శివారులోని పడమటి పాండురంగారెడ్డి భూమిపై మెరుపు దాడి నిర్వహించింది. అక్కడ ఏపీ 10 డబ్ల్యూ 6680 నంబరు గల డీసీఎం వాహనంలో నింపి ఉన్న 250 బస్తాలతో పాటు, వ్యవసాయ క్షేత్రంలో మరో 150 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోడితాల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అమాయక ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి, అక్రమ లాభం కోసం రహస్యంగా తరలిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పట్టుబడిన బియ్యం విలువ లక్షల్లో ఉంటుందని అంచనా. పంచనామా నిర్వహించి వాహనాన్ని, 400 సంచుల బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్సై యుగంధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అక్రమ బియ్యం రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి





- యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవు

**తొలివెలుగు, భువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశించారు. బుధవారం భువనగిరి పురపాలక పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, రోజువారీగా వస్తున్న రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో చికిత్స పొందుతున్న బాధితులతో నేరుగా మాట్లాడి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మందుల కొరత లేకుండా చూడాలని, ఆసుపత్రి పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గర్భిణీలకు పోషకాహారం ఎంతో అవసరం

- పోషణ పక్వాడాలో భాగంగా సామూహిక శ్రీమంతాలు
- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బాలమణి, సీడీపీఓ స్వరాజ్యం




**తొలివెలుగు, ఆలేరు:** బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలక పాత్ర వహిస్తుందని ఆలేరు ఐసీడీఎస్ సీడీపీఓ స్వరాజ్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఐసీడీఎస్ కార్యాలయంలో 'పోషణ పక్వాడ' (ఏప్రిల్ 9 నుంచి 23 వరకు) వేడుకల్లో భాగంగా బుధవారం గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఆలేరు మున్సిపాలిటీ చైర్మన్ బిజన బాలమణి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డ మెదడు అభివృద్ధిలో మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని, వాటిని 'బంగారు రోజులు'గా పరిగణించాలని పేర్కొన్నారు. ప్రతి గర్భిణీ ఆసుపత్రిలోనే ప్రసవమయ్యేలా చూసుకోవాలని, సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే అందించాలని సూచించారు. రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు కొనసాగించడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ బాలమణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీఎం సత్యనారాయణ, సూపర్వైజర్లు ఆండాలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- కొండాపురంలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించిన కొప్పుల వెంకట్‌రెడ్డి
- పాల్గొన్న తహసీల్దార్ రాజేంద్రప్రసాద్

**తొలివెలుగు, మోటకొండూర్:** రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలనే ఆశ్రయించాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మోటకొండూర్ మండలం కొండాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులు పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మంచినీరు, గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, ఏపీఎం ఆనంద్, ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## నేతన్నల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

**- నేటి నుంచి మే 13 వరకు నిర్వహణ**

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వెల్లడి**

**తొలివెలుగు, భువనగిరి:** జిల్లాలోని చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం (ఏప్రిల్ 16) నుంచి మే 13వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన చేనేత కేంద్రాల్లో ఈ శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 10,323 మంది చేనేత కార్మికులు ఉన్నారని, వారందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.

**ఉచిత పరీక్షలు.. మందుల పంపిణీ:**

ఈ శిబిరాల్లో జనరల్ ఫిజీషియన్, కంటి వైద్య నిపుణులు (ఆప్తమాలజిస్ట్), ఎముకల వైద్య నిపుణులు (ఆర్థోపెడిషియన్) అందుబాటులో ఉంటారు. కార్మికులకు రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి (షుగర్), కంటి పరీక్షలు, ఎముకల సంబంధిత సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని తదుపరి చికిత్స కోసం రిఫరల్ ఆసుపత్రులకు తరలిస్తామని కలెక్టర్ తెలిపారు. శిబిరాలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని, చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- పల్లివాడలో ఘనంగా 'బడిబాట'
- నూతన ప్రవేశాలు చేయించిన సర్పంచ్ శ్రీనివాసులు




**తొలివెలుగు, రామన్నపేట:** ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పల్లివాడ గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం రామన్నపేట మండలం పల్లివాడలో 'ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 'మన ఊరు – మన బడి' నినాదంతో పాఠశాల ప్రాముఖ్యతను వివరిస్తూ పలువురు విద్యార్థులకు నూతన అడ్మిషన్లు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల చదువుకు సంబంధించి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, యువత తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు ఘూసీరామ్, రఘురామ్ రెడ్డి, కృష్ణయ్య, నిర్మలాదేవి, జయశ్రీ, లలిత, మధుబాబు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతతోనే ప్రాణాలకు రక్షణ

**- 'అరైవ్ అలైవ్'లో భాగంగా విద్యార్థుల మానవహారం**

**- రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు**

**తొలివెలుగు, రామన్నపేట:** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఆదేశాల మేరకు 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్2026'లో భాగంగా బుధవారం రామన్నపేటలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులతో కలిసి స్థానిక సుభాష్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడటం వల్ల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు "నాన్న, అమ్మ.. ప్లీజ్ మాకు హెల్మెట్ కొనిపెట్టండి" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి.నాగరాజు, ఏఎస్సై సురేందర్, హెడ్ కానిస్టేబుల్ కమలాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# 'పునర్విభజన'కు వ్యతిరేకంగా ఓటేస్తాం



న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లులోని నియోజకవర్గాల పునర్విభజన నిబంధనలకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని వెల్లడించాయి. సంబంధిత బిల్లును తీసుకొస్తున్న విధానాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఇది రాజకీయ ప్రేరేపిత బిల్లు అని ఆరోపించారు. ఏ విపక్ష 'ఇండియా'కూటమి పార్టీల నేతలు బుధవారం ఢిల్లీలో ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. మహిళ రిజర్వేషన్ల బిల్లును తీసుకొస్తున్న విధానం పట్ల తమకు అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. ప్రతిపక్షాలను అణచివేసి బిల్లును నెగ్గించుకోవాలన్నదే ప్రభుత్వ ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్లకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గతంలో ఆమోదించిన సవరణ బిల్లును అమలు చేయాలని కోరుతున్నామని, ప్రభుత్వం మాత్రం డీలిమిటేషన్ పేరిట డ్రామాలాడుతోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ వ్యవహారాన్ని వ్యతిరేకించాలని ఉమ్మడిగా నిర్ణయించినట్లు స్పష్టంచేశారు. మహిళా రిజర్వేషన్లను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. స్పష్టత లేని జనగణన, భవిష్యత్తు డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టొద్దని కోరారు. పార్లమెంట్ వద్ద ఉండాల్సిన అధికారాలను కార్యనిర్వాహక వర్గానికి కల్పిస్తూ, రాజకీయంగా అనుకూలమైనప్పుడల్లా నియోజకవర్గాలను మార్చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అస్సాం, జమ్మూకశ్మీర్‌లో ఇలాంటి మోసం చూశామని ఖర్గే తెలిపారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజనను కచ్చితంగా వ్యతిరేకిస్తామని స్పష్టంచేశారు.

**అధికారం కోసమే ఈ కుతంత్రం: రాహుల్**

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతు ఇస్తోందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఈ బిల్లును 2023లో పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ఇప్పటికే రాజ్యాంగంలో భాగమేనని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదిస్తున్న దానికి మహిళా రిజర్వేషన్లతో ఎలాంటి సంబంధం లేదన్నారు. డీలిమిటేషన్‌తో అధికారం దక్కించుకోవాలన్న కుతంత్రం తప్ప ఇందులో ఇంకేముందని ప్రశ్నించారు. విపక్షాల భేటీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కుల గణన డేటాను విస్మరించి ఓబీసీ, దళిత, ఆదివాసీల హక్కులను చోరీ చేస్తే సహించబోమని హెచ్చరించారు. అలాగే దక్షిణ, ఈశాన్య, వాయువ్య, చిన్న రాష్ట్రాల పట్ల అన్యాయంగా వ్యవహరించడాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు.

**ప్రమాదకరం: కె.సి.వేణుగోపాల్**

మోదీ ప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన చర్య ప్రమాదకరమైనదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై, ముఖ్యంగా రాష్ట్రాలకు సమాన అధికారాన్ని కల్పించే సమాఖ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. విపక్ష నేతల సమావేశంలో డీఎంకే నాయకుడు టి.ఆర్.బాలు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు సాగరికా ఘోష్, శివసేన(ఉద్ధవ్) నాయకులు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు అండగా 'ఉమెన్ సేఫ్టీ వింగ్'



**- సమస్యలుంటే కమిటీకి తెలపండి: డీఎస్పీ సీతారెడ్డి**

**- చౌటుప్పల్‌లో మహిళా సర్పంచులు, ఉద్యోగులతో భేటీ**

**తొలివెలుగు, చౌటుప్పల్: :** విధి నిర్వహణలో మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉమెన్ సేఫ్టీ వింగ్ అండగా ఉంటుందని సిఐడి డీఎస్పీ సీతారెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ ఏసీపీ కార్యాలయంలో మహిళా సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లతో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళా ఉద్యోగులకు లేదా ప్రజాప్రతినిధులకు ఎలాంటి వేధింపులు, సమస్యలు ఎదురైనా భయపడకుండా ఉమెన్ సేఫ్టీ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా సేఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం మహిళా అధ్యక్షురాలు, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆరెగూడెం సర్పంచ్ ధనలక్ష్మి వెంకటరెడ్డి, మిరియాల స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు సఫియా, సుజాత, సంధ్య, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



**- దుబ్బాకలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

తొలివెలుగు, రామన్నపేట: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో భరోసానిస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల నరసింహ అన్నారు. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో బుధవారం బాధితులు ధవనూరి రాములు, కంబాలపల్లి శంకరయ్యలకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఆపద కాలంలో ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుడు గుండాల సతీష్, గ్రామ ఉప సర్పంచ్ గుండాల రమేష్, మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య, వార్డు సభ్యుడు భైరోజు పురుషోత్తమాచారి, శెట్టి శేఖర్, తెల్కలపల్లి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంజాబ్‌తో మ్యాచ్‌కు ముందు ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్

ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 16) పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. వాంఖడే వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్‌కు ముందు ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరం కానున్నాడని తెలుస్తుంది. రోహిత్ ఆర్సీబీతో మ్యాచ్ సందర్భంగా గాయపడిన (ఝఎర్‌తీఱఅస్త్ర ×అయిబతీఎ) విషయం తెలిసిందే. స్కాన్‌లలో గాయం ఉందా లేదా అన్న విషయం స్పష్టంగా తెలియడం లేదు. దీంతో ఎంఐ మేనేజ్‌మెంట్ ముందు జాగ్రత్త చర్యగా హిట్‌మ్యాన్‌కు కొద్ది రోజుల పాటు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. గుజరాత్‌తో మ్యాచ్ (ఏప్రిల్ 20) సమయానికి రోహిత్ పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది. కాగా, ఆర్సీబీ మ్యాచ్‌లో రోహిత్ బ్యాటింగ్ చేస్తూ మధ్యలోనే వైదొలిగిన విషయం తెలిసిందే. పంజాబ్‌తో మ్యాచ్‌కు రోహిత్ దూరమైతే, ఇప్పటికే కష్టాల్లో ఉన్న ముంబై ఇండియన్స్ మరింత ఇబ్బంది పడనుంది. ఈ సీజన్‌లో ముంబై తొలి మ్యాచ్ విజయం తర్వాత హ్యాట్రిక్ పరాజయాలు ఎదుర్కొని పాయింట్ల పట్టికలో చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. రోహిత్ విషయానికొస్తే.. ఈ సీజన్‌లో అతను ఓ మోస్తరు ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. పంజాబ్ మ్యాచ్‌కు రోహిత్ మిస్ అయితే అతని స్థానంలో నమన్ ధీర్‌కు ఓపెనర్‌గా అవకాశం దక్కవచ్చు.



# రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ బౌలర్

బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ రూబెల్ హెస్సేన్ ఏప్రిల్ 15, 2026న అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. 36 ఏళ్ల రూబెల్ తన 15 ఏళ్ల కెరీర్‌లో 159 మ్యాచ్‌లు ఆడి 193 వికెట్లు తీశాడు. 27 టెస్ట్‌ల్లో 36 వికెట్లు, 104 వన్డేల్లో 129 వికెట్లు, 28 టీ20ల్లో 28 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్ తరఫున 2021 ఏప్రిల్‌లో తన చివరి మ్యాచ్ (టీ20) ఆడిన రూబెల్.. ఐదేళ్ల పాటు అవకాశాల కోసం ఎదురుచూసి చివరికి అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ఇకపై దేశీయ క్రికెట్‌లో కొనసాగుతూ, యువ ఆటగాళ్లకు మార్గదర్శకుడిగా ఉంటానని స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ సందేశంలో అభిమానులు, కుటుంబం, మీడియాకు కృతజ్ఞతలు తెలిపాడు. పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరు గడించిన రూబెల్ రివర్స్ స్వింగింగ్ యార్కర్లు వేయడంలో దిట్ట. 2015 వన్డే వరల్డ్‌కప్‌లో పటిష్టమైన ఇంగ్లండ్‌ను మట్టికరిపించడంలో రూబెల్ కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో అతను వేసిన 4-53 స్పెల్ బంగ్లాదేశ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.






# బెంగళూరు ఖాతాలో నాలుగో విజయం

బెంగళూరు: సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 'హ్యాట్రిక్' విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన ఏకపక్ష పోరులో గెలిచి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (32 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ముకుల్ చౌదరి (28 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదోని (24 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ (4/24) లక్నోను పడగొట్టగా... భువనేశ్వర్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బెంగళూరు 15.1 ఓవర్లలో 5 వికెట్లకు 149 పరుగులు చేసి విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లి (34 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్‌స్కోరర్‌గా నిలవగా...రజత్ పాటీదార్ (13 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జితేశ్ శర్మ (9 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో మరో 29 బంతులు ఉండగానే ఆర్సీబీ గెలుపు ఖాయమైంది. మూడు కీలక వికెట్లు తీసిన రసిఖ్ సలామ్‌కు కాకుండా ఒక వికెట్ పడగొట్టిన హాజల్‌వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు ఇవ్వడం గమనార్హం.

**సమష్టి వైఫల్యం...**

చిన్నస్వామి స్టేడియంలో లక్నో ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. మొత్తం పవర్‌ప్లేలో ఆ జట్టు 1 ఫోర్, 2 సిక్స్‌లతో 35 పరుగులే చేయగలిగింది. మార్క్‌రమ్ (12) విఫలం కాగా, మార్ష్ మాత్రం ఫర్వాలేదనిపించాడు. పూరన్ (1) తన వైఫల్యాన్ని కొనసాగించగా, కృనాల్ తన వరుస ఓవర్లలో మార్ష్ , సమద్ (0)లను వెనక్కి పంపించాడు. ఇలాంటి స్థితిలో బదోని కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. మరోవైపు నుంచి ముకుల్ కూడా అతనికి అండగా నిలిచాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా జార్జ్ లిండే (7)ను బరిలోకి దించినా లాభం లేకపోయింది. ఆర్సీబీ పదునైన బౌలింగ్ ముందు మిగతా బ్యాటర్లూ తేలిపోయారు. ఆఖరి 4 ఓవర్లలో లక్నో జట్టు 5 వికెట్లు చేజార్చుకొని 29 పరుగులే చేసింది. ఛేదనలో సాల్ట్ (7) తొందరగానే అవుటైనా... కోహ్లి జోరుగా మొదలు పెట్టాడు. గత మ్యాచ్‌లో మడమ గాయంతో ఫీల్డింగ్ చేయని కోహ్లి ఈ మ్యాచ్‌లో కూడా నేరుగా బ్యాటింగ్‌కే వచ్చాడు. ఐపీఎల్‌లో అతను మొదటిసారి 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగాడు. ప్రిన్స్ వేసిన నాలుగో ఓవర్లో అతను 4 ఫోర్లు బాదాడు. కోహ్లి తాను ఆడిన తొలి 14 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్‌తో 34 పరుగులు సాధించడం విశేషం! మరో ఎండ్‌లో పడిక్కల్ (10) విఫలమైనా... పాటీదార్, జితేశ్ దూకుడుతో ఆర్సీబీ వేగంగా లక్ష్యం దిశగా దూసుకుపోయింది. షమీ ఓవర్లో పాటీదార్ రెండు వరుస సిక్స్‌లు కొట్టగా... రాఠీ ఓవర్లో జితేశ్ వరుసగా 6, 4, 6, 4 బాదాడు. వీరిద్దరు ఒకే ఓవర్లో అవుటైనా...మిగిలిన 25 పరుగులను బెంగళూరు తర్వాతి 15 బంతుల్లో సాధించి మ్యాచ్ ముగించింది.

**స్కోరు వివరాలు**

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (బి) కృనాల్ పాండ్యా 40; మార్క్‌రమ్ (సి) పడిక్కల్ (బి) సలామ్ 12; పంత్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1; నికోలస్ పూరన్ (బి) హాజల్‌వుడ్ 1; ఆయుశ్ బదోని (సి) జితేశ్ (బి) సలామ్ 38; సమద్ (సి) పాటీదార్ (బి) కృనాల్ పాండ్యా 0; ముకుల్ (బి) సలామ్ 39; లిండే (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 7; షమీ (బి) భువనేశ్వర్ 0; అవేశ్ (బి) సలామ్ 1; దిగ్వేశ్ రాఠీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 146. వికెట్ల పతనం: 132, 235, 371, 483, 5118, 6124, 7137, 8137, 9145, 10146. బౌలింగ్: భువనేశ్వర్ 40273, హాజల్‌వుడ్ 40201, రసిఖ్ సలామ్ 40244, కృనాల్ పాండ్యా 40382, సుయాశ్ శర్మ 40340. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** సాల్ట్ (బి) ప్రిన్స్ 7; కోహ్లి (సి) పూరన్ (బి) అవేశ్ 49; పడిక్కల్ (సి) (సబ్) హిమ్మత్ (బి) అవేశ్ 10; రజత్ పాటీదార్ (సి) రాఠీ (బి) ప్రిన్స్ 27; జితేశ్ (సి) ముకుల్ (బి) ప్రిన్స్ 23; డేవిడ్ (నాటౌట్) 14; షెఫర్డ్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (15.1 ఓవర్లలో 5 వికెట్లకు) 149. వికెట్ల పతనం: 19, 266, 386, 4121, 5122. బౌలింగ్: షమీ 30300, ప్రిన్స్ యాదవ్ 30323, దిగ్వేశ్ రాఠీ 40510, అవేశ్ ఖాన్ 40232, లిండే 1.1090.

**పంత్‌కు గాయం...**

హాజల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో బంతి బలంగా తగలడంతో లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ (1) ఎడమ మోచేతికి గాయమైంది. మూడు బంతులు ఆడిన అనంతరం అతను రిటైర్డ్‌హర్ట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత 16వ ఓవర్లో తిరిగి బ్యాటింగ్‌కు వచ్చినా మరో మూడు బంతులే ఆడి అతను అవుటయ్యాడు.



# ఏఐ వినియోగంలో భారత్ టాప్..

న్యూఢిల్లీ: కోడింగ్, డేటా అనాలిసిస్, సంక్లిష్టమైన రీజనింగ్‌లాంటి అంశాల్లో భారత్ ప్రపంచంలోనే అధునాతన ఏఐ మార్కెట్లలో ఒకటిగా ఉంటోందని ఓపెన్ ఏఐ ఒక నివేదికలో తెలిపింది. సంక్లిష్టమైన సవాళ్లను పరిష్కరించేందుకు, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఏఐని తరచుగా యూజర్లు వినియోగించుకోవడంలో టాప్ అయిదు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటోందని పేర్కొంది. అయితే, కృత్రిమ మేధ వినియోగం కొన్ని నగరాలకే పరిమితమవుతోందని సాటి దేశాలతో పోల్చి చూసినప్పుడు, భారత్‌లో మిగతా ప్రాంతాల కన్నా టాప్ నగరాల్లో ఏఐ వినియోగం 3 రెట్లు అధికంగా ఉంటోందని ఓపెన్‌ఏఐ తెలిపింది. రిపోర్ట్ ప్రకారం కోడింగ్, డేటా అనలిటిక్స్ వినియోగంలో కూడా భారత్‌కి పటిష్టమైన ర్యాంకింగ్ ఉంది. 2026 ఫిబ్రవరిలో ఓపెన్‌ఏఐ కోడెక్స్ (కోడింగ్ టూల్) యాప్‌ను ఆవిష్కరించిన రెండు వారాల్లోనే దీని యూజర్ల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది.

# భారత్ వృద్ధి వేగవంతం

వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, 2027లో భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధిని నమోదు చేయనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. 2026లో 6.5 శాతం వృద్ధి అంచనాతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని పేర్కొంది. భారత వస్తువులపై అమెరికా అదనపు టారిఫ్‌లను 50 శాతం నుంచి10 శాతానికి తగ్గించడం వంటి సానుకూల అంశాలు వృద్ధికి దోహదం చేస్తాయని ఐఎంఎఫ్ పేర్కొంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణల కారణంగా ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ, ఈ సానుకూలతల అండతో 2026లో వృద్ధి రేటు 0.3 శాతం మెరుగుపడి 6.5 శాతానికి చేరుతుందని, 2027లో కూడా ఇదే వృద్ధి కొనసాగుతుందని అంచనా వేసింది. ఇరాన్ యుద్ధంతో ప్రంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించిందంటూ, దీని ఫలితంగా 2025లో వృద్ధి రేటు తగ్గుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2026లో వృద్ధి అంచనాను 3.3 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గించింది. 2025లో నమోదైన 3.4 శాతం వృద్ధితో పోలిస్తే తగ్గుముఖం పడుతుందని అంచనా వేసింది. 2027లోనూ 3.2 శాతానికి వృద్ధి రేటు తగ్గుతుందని తెలిపింది. అంతేకాదు ఈ ఏడాదికి ద్రవ్యోల్బణం అంచనాలను లోగడ ప్రకటించిన (జనవరిలో) అంచనా 3.8 శాతం నుంచి 4.4 శాతానికి పెంచింది. యుద్ధానికి ముందు వరకు అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలంగానే నిలబడిందని.. డేటా సెంటర్లు, ఏఐపై భారీ పెట్టుబడులు, ఉత్పాదక పెరగడం ఆర్థికంగా అనుకూలించినట్టు విశ్లేషించింది.

